## శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


పూజలందుకున్న చాముండేశ్వరీ అమ్మవారు

**దోమకొండ :** జిల్లావ్యాప్తంగా గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దోమకొండలోని చాముండేశ్వరీ ఆలయంలో ఉదయం గణపతి పూజ, గౌరి పూజ, పుణ్యహావాచనం, ప్రధాన కలశ స్థాపన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం రుద్రహవణం, మహాహారతి, అమ్మవారి పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణకు 356 కొనుగోలు కేంద్రాలు : కలెక్టర్

**కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ధాన్యం సేకరణకు ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 356 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయాశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన గురువారం మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఏ- గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2320, సాధారణ రకం క్వింటాలుకు రూ.2300 చెల్లిస్తామని పేర్కొన్నారు. సన్న రకం ధాన్యం విక్రయించిన వారికి అదనంగా రూ.500 చెల్లించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 08468-220051కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, ఏసీఎస్‌వో నర్సింహారావు, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

# అగ్రపథాన నిలపడమే లక్ష్యం

### జిల్లాభివృద్ధిపై ముఖాముఖిలో పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్

ఈనాడు, కామారెడ్డి



**అ**భివృద్ధి, సంక్షేమంలో జిల్లాను రాష్ట్రంలో అగ్రపథాన నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలకు అధికార యంత్రాంగం జవాబుదారీగా ఉండాలని కలెక్టరేట్‌లో ఈ-ఆఫీస్ వ్యవస్థను ప్రారంభించామన్నారు. ఉద్యోగులు సమయ పాలన పాటించేలా బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. 'ఈనాడు' నిర్వహించిన ముఖాముఖిలో ఆయన తన కార్యాచరణను వెల్లడించారు. వారి మాటల్లోనే.

**పర్యాటక ప్రాంతాలపై దృష్టి**

లింగంపేట మండలకేంద్రంలోని నాగన్నబావిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాం. నిజాంసాగర్ జలాశయం, కౌలాస్ కోటతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

**బిచ్కుంద పురపాలికకు ప్రతిపాదనలు**

జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద పట్టణాన్ని పురపాలికగా మార్చేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాం. ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడాల్సి ఉంది.

**లింగంపేటను దత్తత తీసుకున్నా**

లింగంపేట మండలాన్ని దత్తత తీసుకున్నాను. పారిశుద్ధ్యంతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఇతర మండలాలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని నిర్ణయించాను. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశాను.

### చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు

ఈ నెల చివరి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సేకరణ చేపట్టనున్నాం. సన్నరకం, దొడ్డురకాలకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ఇటీవలే వ్యవసాయ, పౌరసరఫరాలు, సహకార, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించి ధాన్యం సేకరణకు కార్యాచరణ రూపొందించాం.

### విద్యార్థులకు శిక్షణ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్ అభ్యసించాలనే సంకల్పంతో ఐఐటీ, నీట్ శిక్షణ ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో గణితం, భౌతికశాస్త్రం, రసాయన, జీవశాస్త్రాల్లో అనుభవమున్న ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నాం. వీరు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు 10 జీపీఏ సాధించి ఆర్జీయూకేటీలో సీట్లు సాధించేలా అవసరమైన కార్యాచరణ రూపొందించాం.


### వైద్య కళాశాలలో సీఎంఎస్

**ఉ**మ్మడి జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్‌స్టోర్ నుంచి ఔషధాల పంపిణీలో కొంత సమస్యలు ఉన్నాయి. బోధనాసుపత్రితో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో ఔషధాల కొరతను నివారించేందుకు వైద్యకళాశాల ఆవరణలో సీఎంఎస్ (సెంట్రల్ మెడికల్ స్టోర్)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనికి అవసరమైన కార్యాచరణ తుదిదశకు చేరుకుంది.

# కాంగ్రెస్‌కే ఎల్లారెడ్డి మున్సిపల్ పీఠం

### ఛైర్మన్‌గా శ్రీకాంత్ ఎన్నిక

**ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే :** ఎల్లారెడ్డి బల్దియా పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా పద్మ శ్రీకాంత్ గురువారం ఎన్నికయ్యారు. ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు సమక్షంలో కాంగ్రెస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారాస కౌన్సిలర్లు ఛైర్మన్ ఎన్నికకు దూరంగా ఉండడంతో కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో ఎల్లారెడ్డిని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని శ్రీకాంత్ చెప్పారు.



### పార్టీ మారినా నిరాశే...

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో భారాస 9, కాంగ్రెస్ 3 వార్డులను గెలుచున్నాయి. ఛైర్మన్ ఎన్నికకు మ్యాజిక్ ఫిగర్ సాధించడంతో భారాస తరఫున మున్సిపల్ ఛైర్మన్‌గా కుడుముల సత్యనారాయణను ఎన్నుకున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు గెలుపొందారు. దీంతో అభివృద్ధి పేరిట సత్యనారాయణ భారాసను వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. పార్టీ ఫిరాయించిన కారణంగా భారాస కౌన్సిలర్లు ఏప్రిల్ 27వ తేదీన అవిశ్వాసం పెట్టారు. నిబంధనల ప్రకారం అధికారులు మే 18న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహించారు. 11 మంది ఛైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. సత్యనారాయణ కోర్టుకు వెళ్లడంతో అధికారులు అవిశ్వాసం ఫలితం వెల్లడించలేదు. ఫలితం వెల్లడించాలని భారాస కౌన్సిలర్లు కోర్టుకు వెళ్లడంతో జులై 10న ప్రకటన రావడంతో .. సత్యనారాయణ ఛైర్మన్ పదవిని కోల్పోయారు.

### బోల్తాపడ్డ భారాస

ఎల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో భారాసకు ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ మారిన ఛైర్మన్ సత్యానారాయణపై అవిశ్వాసం పెట్టి నెగ్గారు. దీంతో తమ పార్టీకి చెందిన కౌన్సిలరే ఛైర్మన్‌గా ఎన్నికవుతారని ఆశించిన వారికి భంగపాటు తప్పలేదు. ఆ పార్టీ తరఫున 9మంది కౌన్సిలర్లు గెలుపొందగా ఐదుగురు భారాసను వీడి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు.

### అభివృద్ధి దిశగా...

ఎల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుందని, పట్టణ ప్రగతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఆర్డీవో ప్రభాకర్

# నిధులు పక్కదారి

### మున్సిపాలిటీల లెక్కల్లో తేడాలు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

**ము**న్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులు పక్కదారి పట్టాయి. చాలా చోట్ల ఇష్టానుసారంగా నిధులను ఖర్చు చేశారు. కొన్ని చోట్ల అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా మూడు మున్సిపాలిటీలు ఉండగా 2022-23 వార్షిక ఏడాదిలో రూ.8,73,43,062 నిధులకు సంబంధించిన లెక్కల్లో తేడాలు ఉన్నాయని ఆడిట్ నివేదికల్లో వెల్లడైంది. ప్రజల కోసం ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులను విడుదల చేస్తోంది. కొన్ని మున్సిపాలిటీల్లో నిధుల ఖర్చుకు సంబంధించిన రశీదులు కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల తప్పుడు బిల్లులు పెట్టారు. దీంతో ఆడిట్ అధికారులు మున్సిపాలిటీలకు రిపోర్ట్‌లేఖలు అందజేశారు. 60 రోజుల్లో సమాధానం చెప్పాలని సూచించారు.




### వసూలే తప్ప .. చెల్లించడం లేదు

మున్సిపాలిటీలు ప్రజల నుంచి వసూలు చేసే పన్నులు, అభివృద్ధి కోసం వచ్చిస్తున్న నిధుల్లోంచి కొంత మేరకు ప్రభుత్వానికి చెల్లించాలి. పౌరులు చెల్లించే గ్రంథాలయం పన్నులను మున్సిపాలిటీలు గ్రంథాలయాలకు చెల్లించాలి. అభివృద్ధి కోసం వచ్చించే నిధుల్లో కొంత క్యాసీకి చెల్లించాలి. ఆదాయ పన్నుశాఖకు కొంత, జీఎస్టీ కొంత చెల్లించాల్సి వస్తుంది. కాని మున్సిపాలిటీలు వసూలు చేయడం తప్ప తిరిగి చెల్లించడం లేదు. ఒక్క కామారెడ్డి మున్సిపాలిటీ మాత్రం గ్రంథాలయ సంస్థకు ఏడాదికి రూ.40 లక్షల వరకు చెల్లిస్తోంది. మిగతా బాన్సువాడ, ఎల్లారెడ్డిలు వెనకబడి ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.1.43 కోట్ల నిధులను మున్సిపాలిటీలు గ్రంథాలయ సంస్థకు, క్యాసీకి, జీఎస్టీ కింద చెల్లించాల్సి ఉంది.

| అంశం | నగదు (రూ.ల్లో) |
|---|---|
| నిధుల మళ్లింపు | 32,89,853 |
| వినియోగించని నిధులు | 60,29,662 |
| పన్నులు వసూలు చేయకపోవడం | 1,63,58,825 |
| నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు | 72,49,088 |
| ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు | 1,43,85,768 |
| రికార్డులు హాజరు పరచకపోవడం | 3,89,95,362 |
| ధన దుర్వినియోగం | 5,29,740 |
| అధిక చెల్లింపులు | 5,04,76 |

### ఆ రికార్డుల్లో ఏముందో..?

జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో కలిపి రూ.3.89 కోట్ల నిధుల ఖర్చుకు సంబంధించిన రికార్డులను చూపించలేదు. వాస్తవానికి ఆడిట్ అధికారి వచ్చేసరికి మున్సిపాలిటీకి సంబంధించిన అన్ని రికార్డులు, రశీదులు, జమ, ఖర్చులకు సంబంధించిన అన్నింటిని అందుబాటులో ఉంచాలి. కాని చాలా చోట్ల ఆడిట్ అధికారి వచ్చేసరికే కార్యాలయ సిబ్బంది మాయమవుతున్నారు. ఇక అధికచెల్లింపులు, ధనదుర్వినియోగానికి సంబంధించిన అంశాల్లో రూ.10.34 లక్షల నిధులు పక్కదారి పట్టినట్లు ఆడిట్ నిగ్గు తేల్చింది.

### రికవరీ లేఖలు రాస్తాం

**- కిషన్ పామర్, జిల్లా ఆడిట్ అధికారి, కామారెడ్డి**

**జి**ల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో రూ.8.73 కోట్ల లెక్కల్లో తేడాలు ఉన్నాయి. దీంతో వారికి రిపోర్ట్ లేఖలు అందించాం. దీనికి 60 రోజుల్లో సమాధానం చెప్పాలి లేకుంటే రికవరీ లేఖలు రాస్తాం. అప్పుడు కూడా స్పందన రాకుంటే సర్‌ఛార్జి లేఖలు రాసి కలెక్టర్‌కు నివేదిస్తాం.

# యథేచ్ఛగా ఇసుక రవాణా

### రాత్రి వేళ దందా

న్యూస్‌టుడే, బాన్సువాడ

**బా**న్సువాడలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. కొందరు వ్యాపారులు రోజూ రాత్రి ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బీర్కూరు, పొతంగల్ మండలాల నుంచి ఇసుక బాన్సువాడకు తీసుకొస్తున్నారు. మరికొందరు హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్రలకు అక్రమంగా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. డివిజన్‌లోని అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలతో పాటు కొందరు వ్యాపారులు జట్టుగా ఏర్పడి అధికారులను ప్రసన్నం చేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

### మంజీర నుంచి తీసుకొచ్చి..

వర్షాకాలం కావడంతో ఇసుకకు డిమాండ్ ఉంది. సాధారణ సమయంలో ఇసుక ట్రాక్టర్‌కు రూ.2000 నుంచి రూ.2500కు లభించేది. ప్రస్తుతం రూ.5000 నుంచి రూ.5500 వరకు పలుకుతోంది. ఇళ్లు నిర్మించుకునే వారు ఎంతైనా డబ్బులు ఇచ్చి తీసుకునే పరిస్థితి ఉంది. ఇదే వ్యాపారులకు వరంగా మారింది. దీంతో మంజీర నుంచి ట్రాక్టర్లలో ఇసుక తీసుకొచ్చి ఒక చోట డంప్ చేస్తున్నారు. రాత్రి పూట అక్కడి నుంచి టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

### గస్తీ పెంచుతాం

**ఇ**సుక అక్రమ రవాణా గురించి నా దృష్టికి రాలేదు. సమాచారం ఉంటే తప్పకుండా ఇసుక లారీలు జప్తు చేసి వారిపై చర్యలు తీసుకుంటాం. సిబ్బందికి చెప్పి గస్తీ పెంచి అక్రమంగా రవాణా కాకుండా చూస్తాం. **- అశోక్, సీఐ, బాన్సువాడ**


రాత్రి వేళ బీర్కూర్ నుంచి బాన్సువాడకు టిప్పర్‌లో ఇసుక తరలింపు

# తెరపైకి కుడా

### ప్రభుత్వానికి జిల్లా నుంచి ప్రతిపాదనలు

ఈనాడు, కామారెడ్డి

**ప**ట్టణీకరణ, కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధుల సాధనే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇటీవల ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో ప్రత్యేకంగా ఏర్పాటైన అధికారుల కమిటీ ఆధ్వర్యంలో విస్తృత అధ్యయనం అనంతరం కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాస్థాయిలో డీఎల్‌సీ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదించారు.

### అథారిటీ పరిధిలోకి 535 పంచాయతీలు

గతానికి భిన్నంగా జిల్లా పరిధిలోని 474 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 535 పంచాయతీలను కలుపుతూ పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, అదనపు కలెక్టర్(స్థానికసంస్థలు), డీపీవో, డీటీసీపీవోలు కమిటీలో సభ్యులుగా అథారిటీ పరిధిని నిర్దేశిస్తూ ప్రతిపాదనలు రూపొందించారు. జిల్లాకేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పురపాలికలను కలుపుకొంటూ పంచాయతీలతో పాటు చిన్న ఆవాస ప్రాంతాలను సైతం కుడా పరిధిలోకి చేర్చాలని నిర్ణయించారు. ఇది 3,600 చ.కి.మీల పరిధిలో ఏర్పాటు కానుంది.

### ఆమోదం పొందితే ప్రత్యేక మాస్టర్‌ప్లాన్

జిల్లాల పునర్విభజన తర్వాత అప్పటి కలెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కామారెడ్డి పురపాలికకు పదికిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న పంచాయతీలను కలుపుతూ కామారెడ్డి పట్టణాభివృద్ధి సంస్థ(కుడా)ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు రూపొందించి నివేదించారు. సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో దీనికి ఆమోదం లభించలేదు. ప్రతిపాదిత సంస్థకు ఆమోదం లభిస్తే ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే భవిష్యత్తులో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. ట్రేడ్ లైసెన్స్‌లతో పాటు ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల జారీ కొంత కఠినతరం కానున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందే కుడాకు ఆమోదం లభించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

### సంస్థతో ప్రయోజనాలు

**కు**డా ఏర్పాటైతే బహుళ ప్రయోజనాలు ఉంటాయని పట్టణ ప్రణాళిక విభాగం నిపుణులు చెబుతున్నారు. సంస్థకు ప్రభుత్వం ఛైర్మన్‌ను నియమిస్తుంది. కార్యకలాపాల నిర్వహణకు ఉపాధ్యక్షుడిగా ఐఏఎస్ లేదా గ్రూప్-1 స్థాయి అధికారిని నియమిస్తారు. ఇంజినీరింగ్, సర్వే, సాంకేతిక విభాగాలు ఏర్పాటు కానున్నాయి. సంస్థ పరిధిలో లేఅవుట్‌లు, వెంచర్ల అనుమతులను పట్టణ ప్రణాళికకు అనుగుణంగా మంజూరు చేయనున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరవుతాయి. బడ్జెట్‌లో పట్టణీకరణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఏటా 50 వేల నుంచి 60 వేల ఇళ్లను కేటాయిస్తూ నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తుంది.

## దేశం అబ్బురపడేలా రైతు సంఘం మహాసభలు

**కామారెడ్డి వ్యవసాయం, న్యూస్‌టుడే:** దేశం అబ్బురపడేలా ఈ నెల 5న కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర, జిల్లా నాయకులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఈ సభ ద్వారా డిమాండ్ చేయబోతున్నామన్నారు. సమస్యల పరిష్కారం కోసం రైతులంతా ఏకం కావడానికి సన్నద్ధమవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ సభ ద్వారా చేసిన రైతు డిక్లరేషన్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం లాభసాటి వ్యవసాయం దిశగా రైతులను నడిపించాలన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమిరెడ్డి అంజన్న, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర, జిల్లా నాయకులు

## అందుబాటులో యాసంగి విత్తనాలు

**జుక్కల్, న్యూస్‌టుడే:** జుక్కల్ ప్రాంతాల్లో యాసంగిలో సాగయ్యే సెనగ విత్తనాలు సహకార సంఘం గోదాంలో నిల్వ ఉన్నట్లు కార్యదర్శి బాబురావు తెలిపారు. విత్తనాల కోసం అన్నదాతలు ఆందోళన చెందొద్దని, సరిపడా తెప్పిస్తామని చెప్పారు. 25 కిలోల బస్తా ధర రూ.2250 ఉందని, అవసరమైన వారు వచ్చి తీసుకువెళ్లాలని సూచించారు.


జుక్కల్ సొసైటీ గోదాంలో నిల్వ చేసిన విత్తనాల బస్తాలు

## వచ్చింది వచ్చినట్లుగా..

**నిజాంసాగర్, న్యూస్‌టుడే:** నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోందని, అంతే స్థాయిలో దిగువనకు నీరు విడుదల చేస్తున్నామని జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రానికి సాగర్‌లోకి 24000 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో మూడు గేట్లను ఎత్తి 22500 క్యూసెక్కులు మంజీరా నదిలోకి, 1500 క్యూసెక్కులు జలవిద్యుదుత్పత్తి కేంద్రం నుంచి నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.96 అడుగులు (17.744 టీఎంసీలు) నీరు ఉందన్నారు.


నిజాంసాగర్ చిన్నపూలు వంతెన వద్ద నిండుగా పారుతున్న మంజీరా

## అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

**లింగంపేట, న్యూస్‌టుడే:** అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని అన్నదాతలు ధర్నా నిర్వహించారు. గురువారం లింగంపేట మండల కేంద్రంలో రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. వారికి మద్దతుగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలను రోడ్డు మీదకు తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు దివిటి రమేష్, సంపత్‌గౌడ్, ముదాం సాయిలు, సంజీవరెడ్డి, బొల్లు శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతులకు మద్దతు తెలుపుతున్న జాజాల సురేందర్

'ఇటీవల కామారెడ్డి కోర్టులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడు గతంలో మద్యానికి బానిసై డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. అతడి ముఖంలో ఏనాడు చిరునవ్వు లేదు. మనసు ఆందోళనకు గురై తప్పు చేశారు. తల్లినే పొట్టనబెట్టుకున్నారు. జీవితంలో ఆనందానికి చోటివ్వకపోవడం, మద్యానికి బానిసవ్వడంతో కుటుంబమే చిన్నాభిన్నమైంది.'

'కామారెడ్డి జిల్లాకేంద్రంలోని రాజీవ్ ఉద్యానంలో ఉదయం పూట వాకర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నడక సాగిస్తారు. అనంతరం పావుగంట నవ్వడానికి సమయం కేటాయిస్తారు. తద్వారా నడకకు వచ్చిన వారి మనసు మరింత తేలికవుతుంది. 30 మందిలో 28 మంది సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉన్నారు. రక్తపోటు, మధుమేహం వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తపడుతున్నారు.'

# నవ్వేద్దాం.. జీవిద్దాం

- ఒత్తిడిని దూరం చేస్తేనే ఆరోగ్యం
- నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

**నవ్వడం ఒక భోగం.. నవ్వించడం ఒక యోగం.. నవ్వలేకపోవడం ఒక రోగం అన్నాడో సినీ కవి.**

నవ్వు నలభై విధాల మేలు అనేది నేటి మాట. మన ముఖంలో నవ్వు కనబడాలంటే 32 కండరాలు కదలాలి. ముఖానికి వ్యాయామంలా నవ్వు ఉపయోగపడుతుంది. మొత్తం జీవరాశుల్లో నవ్వు మనుషులకు లభించిన వరం. ఈ రోజుల్లో అనేక మంది ఒత్తిడిబారిన పడి అనేక అనారోగ్యాల పాలవుతున్నారు. ఎప్పటికప్పుడు ఆందోళనను తరిమేస్తే మనసు ప్రశాంతంగా మారుతుంది. ఏటా అక్టోబరులో మొదటి శుక్రవారాన్ని నవ్వుల దినోత్సవంగా జరుపుకొంటారు. ఈ సందర్భంగా కథనం.



'నిజాయతీగా ఉండేందుకు ప్రయత్నించండి. ఒక వ్యక్తి నవ్వడానికి సహాయం చేయండి.'
- ఇది 2024 ప్రపంచ నవ్వుల దినోత్సవ థీమ్

### మానసిక ఉల్లాసానికి దోహదం

మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలంటే రోజు కనీసం గంటసేపైనా నవ్వాలని ఇటీవల అధ్యయనాలు చెబుతున్నాయి. ఎలాంటి ఒత్తిడి అయినా నవ్వుతోనే తొలగిపోతుంది. మరొకరిని నవ్వించడానికి కారణమైనప్పుడు రెట్టింపు ఆనందాన్ని పొందగలుగుతారు. ఆనందంగా ఉన్నప్పుడు మెదడు నుంచి ఎండార్ఫిన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. చిరునవ్వును ప్రేరేపించడానికి ముఖ కండరాలకు న్యూరోనల్స్ అనేవి సంకేతాలు అందిస్తాయి. నవ్వుతున్న కండరాలు సంకోచించినప్పుడు అవి తిరిగి మెదడుకు ఒక సంకేతాన్ని పంపుతాయి. మనిషిని ఉత్తేజపరుస్తాయి.


### ఒనగూరే ప్రయోజనాలు



- తరచూ నవ్వుతూ ఉండటం ద్వారా ఒత్తిడి తగ్గి రోగనిరోధకశక్తిని పెంపొందిస్తుంది.
- సహనం పెరుగుతుంది.
- హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- చిరునవ్వుతో సహజ నొప్పులను దూరం చేస్తుంది. సెరటోనిన్ అనే హార్మోన్ విడుదలై నొప్పి నియంత్రణకు సాయపడుతుంది.
- యవ్వనంగా మరింత ఆకర్షణీయంగా ఉండేందుకు నవ్వు దోహదం చేస్తుంది. ఎదుటి వారితో నమ్మకం బలపడుతుంది.

### బీపీని తగ్గిస్తుంది

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1.60 లక్షల మంది రక్తపోటుతో, 1.80 లక్షల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. అనుక్షణం ఒత్తిళ్లు.. మానసిక ఆందోళన.. భయం భయంగా బతకడం వంటి చర్యలతో మరింత కుంగిపోతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు నవ్వడం ఒకటే పరిష్కారమని వైద్యులు చెబుతున్నారు. నవ్వుతో రక్తపోటు, మధుమేహం నుంచి కాపాడుకోవచ్చు. నవ్వడం ముఖానికి వ్యాయామంలా ఉపయోగపడుతుందని కామారెడ్డికి చెందిన ఫిజీషియన్ డా.పవన్ పేర్కొన్నారు.




# ప్రశస్త్.. దివ్యమైన యాప్!

☛ విద్యార్థుల మానసిక, శారీరక సమస్యల గుర్తింపు

న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లోని విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక, ఇతర సమస్యలతో బాధపడుతుంటారు. ఎక్కువ మందిలో వైకల్యం కనిపించేలా ఉండవు. ఇలాంటి వారిని గుర్తించడానికి నూతన విద్యావిధానానికి అనుకూలంగా ఎన్‌సీఈఆర్‌టీ ప్రశస్త్(ప్రీ అసెస్‌మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్) అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీనిపై ఇప్పటికే విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. గత నెల 27 నుంచి ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో సర్వే ప్రారంభమైంది.



ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

### నమోదు ఇలా...

- ప్రశస్త్ యాప్‌ను ఉపాధ్యాయులంతా తమ చరవాణుల్లోని ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ప్రధానోపాధ్యాయులు పాఠశాల మెయిల్ ద్వారా, ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ అవ్వాలి.
- విద్యార్థులను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- సర్వే పూర్తయిన తర్వాత విద్యార్థుల వివరాలను గోప్యంగా ఉంచాలి.
- ఉపాధ్యాయులు సర్వేను పూర్తి చేసిన తర్వాత స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ (ఐఈఆర్పీ) మరోసారి సర్వే చేస్తారు.

**పాఠశాలలు, విద్యార్థుల వివరాలు**


| జిల్లా | ప్రాథమిక | ప్రాథమికోన్నత | ఉన్నత | విద్యార్థులు |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | 789 | 137 | 269 | 1,42,560 |
| కామారెడ్డి | 548 | 226 | 186 | 1,20.430 |

### సర్వేలో పరిశీలించే అంశాలు

- విద్యార్థి ఎలా మాట్లాడుతున్నాడు
- సరిగా చదవగలుగుతున్నాడా?
- ఎలా రాస్తున్నాడు
- హోం వర్క్ సరిగా చేస్తున్నాడా?
- తరగతి గదిలో విద్యార్థి ప్రవర్తన
- ఉపాధ్యాయుడి సూచనలు పాటిస్తున్నాడా?
- కాళ్లు, చేతులు, తల, పొడవు, పొట్టి, చేతి వేళ్లు మొదలైన అవయవాలకు సంబంధించిన వివరాలు
- చూపు ఎలా ఉంది రంగులను గుర్తిస్తున్నాడా...నల్లబల్ల సరిగా కనిపిస్తుందా, గణిత చిహ్నాలను గుర్తిస్తున్నాడా? అనే వివరాలు పరిశీలిస్తారు.
- విద్యార్థుల్లో వైకల్యాలను గుర్తించి దానికి తగిన చికిత్స అందించనున్నారు.
- సదరం ధ్రువీకరణ పత్రం ఇప్పిస్తారు. తరగతుల వారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు అందేలా చూస్తారు. దివ్యాంగుల తల్లిదండ్రులకు బ్యాంకు రుణాలు అందిస్తారు

### త్వరలో పూర్తి చేస్తాం

...శ్రీనివాసురావు జిల్లా సమన్వయకర్త నిజామాబాద్



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యాశాఖ సూచించిన ప్రశ్నల ఆధారంగా యాప్‌లో విద్యార్థుల వైకల్యాలను ఉపాధ్యాయులు గుర్తించి నమోదు చేయాలి. సర్వేను త్వరలో పూర్తి చేయాల్సి ఉంటుంది. మళ్లీ ఐఈఆర్పీలు సర్వేను పూర్తి చేసి గుర్తించిన వైకల్యాల ఆధారంగా వారికి చికిత్స అందిస్తారు. ఇతర ప్రయోజనాలు కల్పిస్తారు.

## 'ఆక్రమణలపై చర్యలు తీసుకోండి'

**కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కామారెడ్డి పట్టణంలోని 15వ వార్డులో ఓ వర్గం వారు 50 ఫీట్ల రోడ్డును ఆక్రమించడానికి యత్నిస్తున్నారంటూ కాలనీవాసులు కలెక్టరేట్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ఓ వర్గం వారి సమాధులు ఉన్న ప్రదేశంలో రోడ్డును ఆక్రమించుకుని ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నం జరుగుతోందన్నారు. వందలాది కుటుంబాలు నివసించే కాలనీలో సమాధులు ఉండడం ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సమాధులను మినహాయించి ఇకపై మరో ప్రాంతంలో సమాధులను ఏర్పాటు చేయించాలని కోరారు.



కలెక్టరేట్ ఏవోకు ఫిర్యాదు చేస్తున్న 15వ వార్డు వాసులు

## బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఖరారు

**నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి జిల్లా జట్టు ఖరారైందని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధానకార్యదర్శి శ్యామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలో ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగే 68వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

**ఎంపికైన క్రీడాకారులు:** సాయిశివ, ఉదయ్, మొగలాజి, శివమహేశ్, పండరి, దీక్షిత్, సాయినాథ్, హర్షిత్, అశ్వంత్, సాయికుమార్

## ప్రజలకు అసౌకర్యం లేకుండా చూస్తాం

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** బతుకమ్మ పండగ దృష్ట్యా నిమజ్జనానికి అసౌకర్యం లేకుండా పురపాలక శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని ఛైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. జిల్లాకేంద్రంలో వివిధ వార్డుల్లో నిమజ్జనం కోసం కృత్రిమంగా ఏర్పాటుచేసిన కుండీలను ఆమె గురువారం పరిశీలించారు. రోడ్డుపై మొరం వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డు కౌన్సిలర్లు, నాయకులు తయ్యబా సుల్తానా, సలీం, ఇమ్రాన్, మొయినొద్దీన్ తదితరులున్నారు.



బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ ఇందుప్రియ

### నీటి ఎద్దడికి పరిష్కారం

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లాకేంద్రంలో 49వ వార్డులో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టారు. ఇటీవల నూతనంగా తవ్విన బోరును ఛైర్‌పర్సన్ ఇందుప్రియ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మెరోజ్ మెహెర్, మాజీ కౌన్సిలర్ షేరు తదితరులున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు

**కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సంఘం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్‌ను కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పప్పుల రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంతోష్, కోశాధికారి సుదర్శన్, సభ్యులు నాగరాజు, జలపతిరావు, రాజేందర్, ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

# పూల సింగిడి.. యువతుల సందడి

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఉన్నత చదువుల కోసం ఎక్కడున్నా బతుకమ్మ పండగొచ్చిందంటే ఇందూరు యువతులు ఇళ్లకు చేరుతారు. చరవాణులు పక్కనబెట్టి ఈ తొమ్మిది రోజులు ఉత్సవాల్లో పాల్గొంటారు. స్వయంగా పూలు సేకరించడం మొదలుకొని.. అందరికంటే ముందే బతుకమ్మ పేర్చడంలో పోటీపడతారు. మిగతా యువతుల కంటే భిన్నంగా ఆకర్షణీయంగా ఉండేలా చూసుకుంటారు. అంతా కలిసి అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడుతూ ఆటలు ఆడుతారు.. వివిధ ప్రాంతాల్లో చదువుతూ పండగకు స్వగ్రామానికి చేరుకున్న యువతులు తమ మనోగతం 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.



తయారు చేసిన బతుకమ్మలతో విద్యార్థినులు

### బృందంగా ఏర్పడ్డాం

- భార్గవి, డిగ్రీ ఫైనల్, నిజామాబాద్



రెండో తరగతి నుంచే ఇష్టం పెంచుకున్నా. అమ్మ నుంచి బతుకమ్మ ఎలా పేర్చాలో నేర్చుకున్నా. గునుగ పూలకు రంగులు అద్దడం, అందరికంటే భిన్నంగా ఆకర్షణీయంగా ఉండేలా చూసుకుంటా. మా కాలనీ స్నేహితురాళ్లతో కలిసి బృందంగా ఏర్పడ్డాం. అందరం కలిసి ఉత్సవాలు సరదాగా జరుపుకొంటాం.



### భిన్నంగా ఆలోచిస్తా

- శివానీ, నిజామాబాద్

తొమ్మిది వరుసల్లో బతుకమ్మ పేర్చడంలో అందరికంటే భిన్నంగా ఆలోచిస్తా. పూలశిఖరంగా రూపొందించి తమలపాకుపై పసుపుతో తయారుచేసిన గౌరమ్మను పూజించేందుకు నియమ నిష్టతో దీక్ష చేస్తా. ఎక్కడున్నా, ఏ హోదాలో ఉన్నా పూల పండగను మరిచిపోను.

### నా పాటలు ఉండాల్సిందే..

- జాగృతి, డిగ్రీ ద్వితీయ, నిజామాబాద్



అక్క, నేను చిన్నప్పటి నుంచి వేడుకల్లో ముందుంటాం. అమ్మ శివలీల ద్వారా పాటలు నేర్చుకున్నాం. శ్రీలక్ష్మి.. నీ మహిమలు బతుకమ్మ తదితర ఐదు పాటలు పాడుతా. మా కాలనీలో నా పాటలు తప్పకుండా ఉండాల్సిందే. డీజే పాటలు కాకుండా సొంతంగా ఆలపించేందుకే మేమంతా ఇష్టపడుతాం.

### అనుబంధం ఏర్పడుతుంది

- లిఖిత, లక్ష్మాపూర్, నిజామాబాద్ గ్రామీణం



నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో చదివే స్నేహితులం బతుకమ్మ వచ్చిందంటే ఇంటికి వచ్చేస్తాం. అందరం పాటలు పాడుతూ, కలిసి చప్పట్లు కొడుతూ ఆడుతుంటే కొత్త అనుబంధం పెనవేసుకుంటుంది. మన సంస్కృతికి గౌరవం ఇచ్చినప్పుడే భారత దేశ గొప్పతనం ఇతరులకు తెలుస్తుంది.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

## పీసీసీ అధ్యక్షుడి సన్మానానికి తరలిరండి

**కామారెడ్డి సంక్షేమం, న్యూస్‌టుడే:** పీసీసీ అధ్యక్షుడిగా నియమితులై తొలిసారిగా జిల్లాకు వస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానించేందుకు కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న నూతన అధ్యక్షుడికి భిక్కనూరు టోల్‌గేట్ వద్ద సన్మానం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ హాజరవుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, గుడుగుల శ్రీనివాస్, శివ, లక్ష్మణ్, గంగాధర్, మోహన్, పాల్గొన్నారు.

## నెలలో 152 చరవాణుల రికవరీ

**కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే:** జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న రూ.20 లక్షల విలువైన 152 చరవాణులను ప్రత్యేక పోలీసుల బృందం నెల రోజుల్లోనే రికవరీ చేసిందని జిల్లా ఎస్పీ సింధూశర్మ చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన చరవాణుల రికవరీ మేళాలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. చరవాణి పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 2020 చరవాణులను రికవరీ చేశామన్నారు. రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది రాజు, శ్రీనివాస్, ఇర్ఫాన్, వినోద్, రాజ్‌కుమార్‌లను ఎస్పీ అభినందించారు. ఏఎస్పీ నర్సింహారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



విద్యాశాఖ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు

## కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

☛ ఇప్పటికే 607 మంది అభ్యర్థులవి పూర్తి

న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. గురువారం వరకు 607 మందివి అధికారులు పరిశీలించారు. ఎంపికైనవారి జాబితాలన్నీ వెల్లడయ్యాయి. ఉదయం నుంచి విద్యాశాఖ కార్యాలయానికి వందలాది మంది తరలివచ్చారు. ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేయడంతో అభ్యర్థులు బారులు తీరారు. కామారెడ్డి జిల్లాలో వివిధ విభాగాల పరిధిలో 506 పోస్టులు ఉన్నాయి. 1518 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించాల్సి ఉండగా ఇప్పటి వరకు 40 శాతం ప్రక్రియ పూర్తయింది.

**సమాచారం వచ్చినవారు రావాలి..** డీఎస్సీ పరీక్ష రాసిన అభ్యర్థుల చరవాణికి లేదా మెయిల్‌కు సంక్షిప్త సందేశాలు వచ్చాయని, వారు విద్యాశాఖ కార్యాలయానికి రావాలని డీఈవో రాజు గురువారం వెల్లడించారు. సమాచారం వచ్చినా ధ్రువపత్రాల పరిశీలనకు రానివారు స్పందించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గది నెం. 223 లో విచారణ దరఖాస్తును సమర్పించాలన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించేందుకు గడువు నిర్దేశించారు. ఒక్కో పోస్టుకు పోటీ తీవ్రంగా ఉండటంతో వరుస క్రమంలో ప్రతిభ చాటిన వారికే ఉద్యోగం వరించే అవకాశాలున్నాయి. ఈ నెల 9న హైదరాబాద్‌లో నియామకపత్రాలు అందించేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది.

## రాకపోకలకు అంతరాయం

జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. రూ.39 కోట్లతో ప్రగతి పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం వారధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మురుగు కాల్వ నిర్మాణ పనుల దృష్ట్యా ఆర్డీవో కార్యాలయం, వివేకానందకాలనీ వైపు నుంచి స్టేషన్‌కు వచ్చే మార్గాన్ని అధికారులు మూసివేసి బోర్డు పెట్టారు. సరకుల రవాణాకు అశోక్‌నగర్ నుంచి నూతనంగా నిర్మించిన రోడ్డు ద్వారా వాహనాలను అనుమతిస్తున్నారు. ప్రజలకు అసౌకర్యం తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం




ఆర్డీవో కార్యాలయం వైపు నుంచి వచ్చే మార్గాన్ని మూసివేసిన అధికారులు

## టిప్పర్ ఢీకొని ఉపాధిహామీ ఉద్యోగి మృతి

**మాచారెడ్డి, న్యూస్‌టుడే:** టిప్పర్ ఢీకొని ఉపాధిహామీ ఉద్యోగి మృతి చెందిన ఘటన పల్వంచ మండలం భవానిపేట శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలం యాచారం గ్రామానికి చెందిన మాలోత్ జైల్ సింగ్ (30) మాచారెడ్డి మండలం ఉపాధి కార్యాలయంలో సాంకేతిక సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. భవానిపేటలో విధులు నిర్వహించుకొని మాచారెడ్డి కార్యాలయానికి వెళ్తుండగా.. భవానిపేట శివారుకు రాగానే మూత్ర విసర్జన చేయడానికి రోడ్డు పక్కన ద్విచక్రవాహనం ఆపాడు. అతివేగంగా అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్ అతడిని ఢీకొట్టింది. వాహనం అతడిపై నుంచి వెళ్లి పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. జైల్‌సింగ్‌కు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.



మాలోత్ జైల్ సింగ్

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242

బాన్సువాడలోని రెండు పడకగదుల కాలనీలో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్తతో పేరుకుపోయాయి. - రాహుల్, బాన్సువాడ



ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు నరేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించారు.

జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ సమీపంలో రోడ్డుపై నీటి నిల్వతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - శంకర్, హౌసింగ్‌బోర్డుకాలనీ



యంత్రంతో సమస్య పరిష్కరించాం. - వర్దేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

జిల్లాకేంద్రంలోని భవానీరోడ్డులో కాల్వ పూడిక తీయడం లేదు. - మురళీధర్, భవానీరోడ్డు



సిబ్బందితో కాల్వ పూడిక తీయించాం. - వర్దేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

బిచ్కుంద పోలీస్‌స్టేషన్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన దీపాలు వెలగడం లేదు. మహేష్, బిచ్కుంద

పాత వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాము. శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి, బిచ్కుంద.

బాన్సువాడ - బిచ్కుంద దారిలో పుల్కల్ చెరువు మూల మలుపు వద్ద సూచికలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంతోష్, పుల్కల్

సూచిక బోర్డుల ఏర్పాటుకు నివేదిక పంపించాం. గుత్తేదారుతో త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. వినోద్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈఈ, బిచ్కుంద

ముత్యంపేట బురుజు ప్రాంతంలో 15 రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. - అజిత్‌గౌడ్, ముత్యంపేట

తొందరలో వీధి దీపాలు బిగిస్తాం. - అంజయ్య, గ్రామ కార్యదర్శి, ముత్యంపేట

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం, బాన్సువాడ పట్టణం, బిచ్కుంద, బిచ్కుంద గ్రామీణం, దోమకొండ

# కొత్త రేషన్ డీలర్లు వస్తున్నారు

● జిల్లాలో 70 మంది నియామకాలు పూర్తి

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

జిల్లాలో కొత్త రేషన్‌డీలర్ల నియామకాలు పూర్తయ్యాయి. 12 ఏళ్ల తర్వాత కొత్త రేషన్ డీలర్లు బాధ్యతలు తీసుకోనున్నారు. ఎంపికైన వారికి లైసెన్సుల పత్రాలు కూడా జారీ అయ్యాయి. మిగిలిన ప్రక్రియను పౌరసరఫరాలశాఖ పూర్తి చేయనుంది. జిల్లావ్యాప్తంగా 578 రేషన్ దుకాణాలు ఉండగా 89 ఖాళీలు ఉండేవి. వీటిని 12 ఏళ్లుగా ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. ఎట్టకేలకు వీటిలో 70 పోస్టులను భర్తీ చేశారు. నియామకమైన వారికి త్వరలో రేషన్ కోటా కేటాయించనున్నారు.

### పంపిణీలో జాప్యం ఉండదు

జిల్లాలో ఇప్పటి వరకు ఇన్‌ఛార్జిలతో రేషన్ దుకాణాలను నడిపిస్తూ వచ్చారు. ఒక్కో డీలర్‌ను రెండు మూడు దుకాణాలకు ఇన్‌ఛార్జిగా నియమించారు. దీంతో బియ్యం పంపిణీలో జాప్యం తలెత్తింది. సదరు డీలరు తన రెగ్యులర్ దుకాణంలో పంపిణీ పూర్తి చేసిన తర్వాత ఇన్‌ఛార్జిగా వ్యవహరించే దుకాణానికి వెళ్లి బియ్యం ఇచ్చేవారు. దీంతో జాప్యం జరిగేది. కొందరు లబ్ధిదారులు ఇతర గ్రామాల్లోని దుకాణాలకు వెళ్లి బియ్యం తెచ్చుకునేవారు. కొత్త రేషన్ డీలర్లు వస్తుండడంతో ఇక సమస్యలు తీరనున్నాయి. 19 డీలర్ దుకాణాలను వివిధ కారణాలతో భర్తీ చేయలేదు. వీటి విషయంలో అధికారులు ఒక నిర్ణయానికి రావాల్సి ఉంది. కొందరు డీలర్లు విధుల్లో ఉండగా మృతిచెందారు. మరికొన్ని న్యాయస్థానాల్లో కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. డీలర్ మృతిచెందితే వారి కుటుంబానికి చెందిన మరొకరికి నియమించే అవకాశం ఉంది.



కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం నుంచి పొందిన లైసెన్స్ పత్రాలను చూపుతున్న నూతన రేషన్ డీలర్లు

### మారిన నిబంధనలు

రేషన్ డీలర్లకు థంబ్ అథెంటికేషన్ ఇచ్చే విషయంలో ప్రభుత్వం నిబంధనలు మార్చింది. గతంలో తహసీల్దార్ కార్యాలయంలోని బయోమెట్రిక్ థంబ్ అథెంటికేషన్ పూర్తి చేసేవారు. దీంతో చాలా మంది డీలర్లు బినామీల వేలిముద్రలు నమోదు చేయించి రేషన్ దుకాణాలు నడిపించినట్లు తనిఖీల్లో వెల్లడైంది. దీంతో ప్రభుత్వం నిబంధనలు మార్చింది. ఇప్పుడు బయోమెట్రిక్ నమోదు అధికారం మొత్తాన్ని పౌరసరఫరాల శాఖకే అప్పగించారు. వీరే కొత్త రేషన్‌డీలర్ల వేలిముద్రలను బయోమెట్రిక్, ఈ-పాస్ యంత్రాల్లో నమోదు చేయనున్నారు. ఈ విషయమై డీఎస్‌వో మల్లికార్జున్‌బాబును న్యూస్‌టుడే వివరణ కోరగా.. తామే బయోమెట్రిక్, ఈ-పాస్ యంత్రాల్లో వేలిముద్రలను నమోదు చేసి దుకాణాలు కేటాయిస్తామని పేర్కొన్నారు.

# ర్యాలీ జయప్రదానికి పిలుపు

**బాన్సువాడ, న్యూస్‌టుడే:** పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్ మొదటి సారిగా నిజామాబాద్‌కు వస్తున్నందున నియోజకవర్గం నుంచి సుమారు 5వేల మంది నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తరలివెళ్తున్నట్లు ఆగ్రోస్ రాష్ట్ర ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి వాహనాల్లో తరలివెళ్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నివాసం నుంచి బాన్సువాడ, నస్రుల్లాబాద్, వర్ని, చందూర్, మోస్రా మీదుగా నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లనున్నట్లు, సమయానికి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, ఖాలెక్, గోపాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఆగ్రోస్ రాష్ట్ర ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్

# 5న 10 కి.మీ పరుగు



**కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి కప్-2024లో భాగంగా ఈ నెల 5వ తేదీన జిల్లాకేంద్రంలో నిర్వహించే 10 కి.మీ పరుగును విజయవంతం చేయాలని జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కప్ టార్చ్‌రిలే ఈ నెల 5వ తేదీన భిక్కనూరు మండలం జంగంపల్లి నుంచి జిల్లాలోని ప్రవేశిస్తుందని చెప్పారు. బైపాస్ రోడ్డు నుంచి కామారెడ్డి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించే పరుగులో అందరూ పాల్గొనాలని కోరారు.

# కొలువుదీరిన అమ్మవార్లు



బాన్సువాడలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి...



బాన్సువాడలో..



కామారెడ్డిలో శాస్త్రి దుర్గా మండలి ప్రతినిధులు



నిజాంసాగర్: గోర్గల్ గ్రామంలో



జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో



తాండూరు కిచ్చనపేట్‌లో

జిల్లావ్యాప్తంగా దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ కాలనీల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవారు కొలువుదీరారు. దుర్గాదేవికి అర్చనలు చేశారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

- న్యూస్‌టుడే బృందం



కామారెడ్డిలోని పెద్దబజార్‌లో ..



బాన్సువాడలో శోభాయాత్రగా...



పిట్లం అయ్యప్ప ఆలయంలో ..



దోమకొండలో ఊరేగింపు



స్థానికులతో మాట్లాడుతున్న డీఈ విజయసారథి

# సమస్య పరిష్కారానికి కృషి

**నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే:** మెదక్- రుద్రూరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల విద్యుత్ స్తంభాలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారని బుధవారం గోపాల్‌పేట్ గ్రామస్థులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసిన సంగతి విదితమే. గురువారం విద్యుత్తు శాఖ డీఈ విజయసారథి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం...రోడ్డు మధ్య నుంచి 13, 15 మీటర్ల దూరంలో ఎక్కడైనా స్తంభాలను ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. హైవే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వెంట సిబ్బంది ఉన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

# అటవీభూములు కాపాడాలి

**బాన్సువాడ, న్యూస్‌టుడే:** అటవీభూములు కాపాడటానికి అన్ని చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ కిరణ్మయి సూచించారు. గురువారం ఆమె రెవెన్యూ, మైన్, అటవీశాఖ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ, అటవీ భూముల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అందరూ కలిసి సర్వే చేసి భూములు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఆదేశించారు.

# కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించండి

**కామారెడ్డి పట్టణం:** జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన చోట డిజిటల్ ప్రొఫైల్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాకేంద్రంలో ఆరో వార్డులో కుటుంబ సర్వే జరిగే తీరును ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం కోరిన ప్రతి వివరాలను సిబ్బంది సేకరించాలన్నారు. ఎంపికైన చోట ఈ నెల 7 వరకు సర్వే జరగనుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్ రావు, ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత, సభ్యులున్నారు.

**నాగిరెడ్డిపేట్:** డిజిటల్ సర్వేను పక్కాగా చేపట్టాలని ఆర్డీవో ప్రభాకర్ పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన మండలంలోని అచ్చాయిపల్లి పంచాయతీలో గురువారం ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహించారు. 182 కుటుంబాలు ఉండగా, అచ్చాయిపల్లిలో 98, రామక్కపల్లి గ్రామంలో 84 కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. గురువారం ప్రారంభమైన సర్వే ఈ నెల 7వ తేదీ వరకు ఐదు రోజులపాటు కొనసాగుతుందని, అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్‌చారి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మహ్మద్, గ్రామపంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, తిరుపతి, వెంకట్, రమేశ్, రవీందర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



అచ్చాయిపల్లిలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

**జుక్కల్:** కుటుంబ డిజిటల్ కార్డులు జారీ చేసేందుకు ఎంపిక చేసిన లొంగన్ గ్రామంలో సర్వే ప్రారంభించామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆ గ్రామానికి వెళ్లిన ఆయన .. పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచరు, ఆశా కార్యకర్తలతో కలిసి ఇంటింటి సర్వే చేశారు. వివరాలను సమగ్రంగా పరిశీలించామన్నారు. ఫార్మట్ వన్ బేస్ ఫ్యామిలీ డేటా నమోదు విషయంలో జాగ్రత్తలు తీసుకొన్నట్లు చెప్పారు. మండల పరిషత్తు కార్యాలయంలోనే డిజిటల్ కార్డులు ప్రింటింగ్ అయ్యేలా కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత

**లింగంపేట, న్యూస్‌టుడే:** లింగంపేట మండలంలోని నల్లమడుగు తండాకు చెందిన దనావత్ శ్రీనివాస్ కొన్ని నెలల క్రితం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి మరణించారు. మృతుడికి భారాస పార్టీ సభ్యత్వం ఉంది. బీమా పరిహారం కింద మంజూరైన రూ. 2 లక్షల చెక్కును ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ గురువారం బాధిత కుటుంబసభ్యులకు అందించారు. నాయకులు దివిటి రమేష్, సంపత్‌గౌడ్, బొల్లు శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, ముదాం సాయిలు, మన్నె శ్రీనివాస్, నర్సింలు, రవి, లక్ష్మణ్, సిద్ధిరాములు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



క్రీడాకారులతో మాట్లాడుతున్న వినోద్

# ఓటమి.. గెలుపునకు తొలిమెట్టు

**జుక్కల్, న్యూస్‌టుడే:** ప్రతి ఆటలో గెలుపోటములు సహజమని, ఓడినా అధైర్య పడొద్దని, ఓటమి గెలుపునకు తొలిమెట్టు అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అస్పత్‌వార్ వినోద్ అన్నారు. గురువారం పెద్దఏడ్గి యువత ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, బ్యాటింగ్ చేసి ఉత్సాహ పరిచారు. వెంట పశువైద్యాధికారి బండివార్ విజయ్, నాయకులు పడంపల్లి లక్ష్మణ్, అస్పత్‌వార్ అరుణ్, అనిల్, రవీందర్, ఉమకాంత్, సాయికర్ణ, తదితరులు ఉన్నారు.

# ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి

**కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** డీఎస్సీ-2024 అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో 1240 మంది అభ్యర్థులు డీఎస్సీకి అర్హత సాధించారని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు 10 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు



బీర్కూర్‌లో..



కామారెడ్డి ధర్మశాల ప్రాంతంలో ..

# బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో..

బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో.. గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడారు. జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం బతకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం నీళ్లలో నిమజ్జనం చేసి సద్దులు ఆరగించారు.

- న్యూస్‌టుడే బృందం



పాత బాన్సువాడలో ..



కామారెడ్డి విద్యానగర్‌లో..



కామారెడ్డిలో పట్టాలు అందుకున్న విద్యార్థులు

# గ్రాడ్యుయేషన్ డే

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లాకేంద్రంలోని ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెవివి ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో గొప్పగా ఎదగాలన్నారు. సీఈవో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక యుగంలో పోటీతత్వం అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కే కళాశాల ప్రిన్సిపల్ దత్తాత్రి, సిబ్బంది మధుసుదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, దత్తుకుమార్, బాల్‌రెడ్డి, సందీప్‌కుమార్, నరేశ్ తదితరులున్నారు.

# జిల్లాస్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయం

**బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే:** డీఎస్సీలో ఎస్జీటీ విభాగంలో జిల్లాస్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణానికి చెందిన సమీరాకు బీసీ-ఈ విభాగంలో మూడో ర్యాంకు సాధించడంతో గురువారం ఆమెను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, రవీందర్, అక్బర్, సాయిలు, ఇలియాస్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ మధుకుమార్

# ఆక్సిజన్ అందుబాటులో ఉంచుకోవాలి

**పిట్లం, న్యూస్‌టుడే:** 108 అంబులెన్సులో ఆక్సీజన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ప్రోగ్రాం మేనేజర్ మధుకుమార్, జిల్లా మేనేజర్ తిరుపతి అన్నారు. గురువారం పిట్లంలో ఉన్న 108 అంబులెన్సును పరిశీలించారు. వివిధ దస్త్రాలు, అత్యవసర మందులు, పరికరాలు తనిఖీ చేశారు. ఈఎంటీ హంజరి, పైలట్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


# ఆర్థిక సాయం పంపిణీ

**భిక్కనూరు:** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన కంచర్ల గ్రామానికి చెందిన మంగళి నారాయణ కుటుంబానికి కొత్త కుమ్మరి సంఘం సభ్యులు గురువారం రూ. 7500 ఆర్థిక సాయం చేశారు.



# పాకురు తొలగించారు

**పిట్లం, న్యూస్‌టుడే:** మద్దెల్‌చెరువులో ప్రధాన రహదారి పక్కన ఉన్న నీటి ట్యాంకు చుట్టూ పాకురు పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నీటి కోసం వచ్చే స్థానికులు పాకురుతో జారి పడే ఆస్కారం ఉందని బుధవారం ఈనాడులో 'పాకురు పట్టించుకోరూ' శీర్షికతో ప్రచురితమైన చిత్ర కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సిబ్బంది చేత ట్యాంకు చుట్టూ ఉన్న పాకురును తొలగించారు.







# భార్య కాపురానికి రావట్లేదని ఆత్మహత్య

**భిక్కనూరు, న్యూస్‌టుడే:** భార్య కాపురానికి రావట్లేదని మనస్తాపంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరులో చోటుచేసుకుంది. ఎస్సై రాంచంద్రం వివరాల ప్రకారం.. గంధం కేశయ్య(40) మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కూతురు పెళ్లి విషయంలో భార్య రూపతో ఇటీవల గొడవపడ్డాడు. వారం క్రితం రూప పుట్టింటికి వెళ్లింది. భిక్కనూరుకు రావాలని కేశయ్య చాలాసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకుని చనిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# మృతదేహం లభ్యం

**గాంధారి, న్యూస్‌టుడే:** గుర్తు తెలియని మృతదేహం(45) లభ్యమైన ఘటన మండల కేంద్రంలోని పెద్దవాగులోని పోచమ్మ రేవు వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడు నలుపు, తెలుపు గీతల టీషర్టు నల్లని నిక్కర్ ధరించి ఉన్నాడని, చేతిపై తమిళంలో వాసుమి అని రాసి ఉందని, కుడి చేతి వేలుకు స్టీల్ ఉంగరం ఉందని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు ఠాణాలో సంప్రదించాలని ఎస్సై అంజనేయులు పేర్కొన్నారు.

# భవనం పెచ్చులూడి తీవ్రగాయాలు

**బాన్సువాడ, న్యూస్‌టుడే:** పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలోని భవనం పెచ్చులూడి ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. పాత భవనం కావడంతో దుకాణం ఎదుట నిలబడిన వ్యక్తికి గాయాలు కావడంతో పాటు అక్కడే ఉన్న ద్విచక్రవాహనం ధ్వంసమైంది. దుకాణయజమాని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు.

# పరామర్శ

**బీబీపేట, న్యూస్‌టుడే:** ఇస్సానగర్ గ్రామానికి చెందిన భారాస నాయకుడు గన్నమనేని రాజు తండ్రి రాంచందర్‌రావు(85) ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. బాధిత కుటుంబాన్ని మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గురువారం పరామర్శించారు. జడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ బాలమణి, పార్టీ గ్రామాధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు దేవునిపల్లి శ్రీనివాస్, రాజేశ్వరావు, రజనీకాంత్, పొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

**కామారెడ్డి సంక్షేమం, న్యూస్‌టుడే:** యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను జిల్లాకేంద్రంలో గురువారం దహనం చేశారు. దిష్టిబొమ్మను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మంత్రి కొండా సురేఖను అవమానపరిచే విధంగా విమర్శలు చేసిన కేటీఆర్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, మాచారెడ్డి, పల్వంచ, దోమకొండ మండలాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజారెడ్డి, సమరసింహారెడ్డి, శ్రీనివాస్, నాయకులు అజ్మత్‌అలీ, శ్రవణ్‌కుమార్, హన్మండ్లు, రవి, ఆరీఫ్, జమీల్, సిద్ధిక్, నర్సాగౌడ్, శ్రీను, లడ్డు, రాజేశ్, భైరవ్ పాల్గొన్నారు.



కేటీఆర్ దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు